క్లుప్తంగా

బోర్డులపై డివిజన్ సిబ్బంది వివరాలు



ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజలకు తమ డివిజన్లలో పని చేసే సిబ్బంది వివరాలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. డివిజన్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద గోడలపై ఆయా డివిజన్లలో పని చేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్, వాటర్ లైన్‌మ్యాన్, పంపు ఆపరేటర్లు, వీధి లైట్లు, చెత్త సేకరణ డ్రైవర్, ఫాగింగ్ సిబ్బంది పేర్లు, వారి ఫోన్ నంబర్‌లో ఆ బోర్డులపై రాశారు. 60 డివిజన్లలో ఈ బోర్డులు ప్రజలు చూసుకునేలా ఏర్పాటు చేశారు.

క్రికెట్ కిట్ అందజేత

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలకు 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళీ రూ.10 వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను బుధవారం అందించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని కిట్‌ను అందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన సేవకులు

ఖమ్మంరూరల్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బుధవారం నిర్వహిస్తున్న జాతీయ ప్రార్థన దినోత్సవానికి పాస్టర్ తడిగొండ పీటర్ ఆధ్వర్యాన మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు సమక్షంలో మండలంలోని పలు గ్రామాల నుంచి సేవకులు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని గోళ్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ మద్ది వీరారెడ్డి జెండా ప్రారంభించారు.

ఘనంగా గోవృషభ కల్యాణం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లిలో గల శ్రీవేంకటేశ్వర గోశాలలో బుధవారం గోవృషభ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. గోశాల నిర్వాహకులు, ప్రధాన అర్చకుడు ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ వేడుకల్లో వందలాది భక్తులు పాల్గొనగా.. గోదూడలకు నామకరణం, ఉయ్యాల వేడుకలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంత్యక్రియల అడ్డగింత

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో బుధవారం మారగాని కోటమ్మ(60) మృతి చెందింది. దీంతో ఓ స్థలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా.. విషయం తెలుసుకున్న వారి బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని వాగ్వాదానికి దిగి అంత్యక్రియలను అడ్డుకున్నారు. స్థలం మాదంటే మాదని రెండు వర్గాలు వారు వాగ్వాదానికి దిగడంతో చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఆ ప్రాంతంలో దేవాలయం ఉన్నందున్న అంత్యక్రియలు చేయొద్దని సూచించడంతో అంత్యక్రియలను శ్మశానవాటికలో చేయించారు.

ప్రతీ శుక్రవారం వృద్ధులకు ప్రత్యేక ఓపీ

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రతీ శుక్రవారం వృద్ధులకు ప్రత్యేక ఔట్ పేషంట్ సేవలు అందుబాటులోకి తేనున్నారు. పెద్దాస్పత్రికి రోగుల తాకిడి పెరగడంతో ఓపీ కోసం వారి పడుతున్న ఇబ్బందులను తగ్గించేందుకు ఈ చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చే వృద్ధులు వైద్యుల రూం వద్ద కూడా గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. దీంతో విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో వృద్ధులకు వారంలో ఒక రోజు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చే శుక్రవారం నుంచి జనరల్ ఆస్పత్రిలో ఓరూంలో అన్ని ప్రత్యేక విభాగాల వైద్యులతో వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు అందనున్నాయి.

అన్ని రంగాల్లో ముందుండాలి

తిరుమలాయపాలెం: ముదిరాజ్‌లు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో ముందుండాలని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఎదుళ్లచెరువులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యాన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వ పరంగా అందే సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం హరినాథ్‌బాబును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర జానకిరాములు, అనంతరాములు, కృష్ణయ్య, వీరన్న, పులకాని వెంకటనర్సయ్య, కుంట వెంకటేశ్వర్లు, తురక రాంబాబు, చంటి, రమేష్, వెంకట్రావు, కాంపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవకీ నందన వాసుదేవ
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	మెకానిక్ రాకీ
ఆదిత్య	రాధే కృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	జీబ్రా

- ఖమ్మంగాంధీచౌక్

రహదారులపై మద్యం మయం..

పేరుకే ఫ్యామిలీ దాబాలు

- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- తాగి నడపడంతో రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- పోలీసులపైనే దాడి?



కోదాడ క్రాస్‌రోడ్‌లో యువకులు మద్యం సేవించి గొడవ పడిన దాబా

ఖమ్మంరూరల్: రాష్ట్ర, జాతీయ రహదారులపై వాహనాలు తూలుతూ వెళ్తున్నాయి. ఆయా రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా వెలసిన దాబాలు, వైన్స్‌ల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, సిట్టింగ్‌లు నడుస్తుండడంతో రహదారుల పక్కన మద్యం ఏరులై పారుతోంది. జాతీయ, రాష్ట్ర రహదారులకు కిలోమీటర్ దూరంలో వైన్స్‌లు, బార్లు ఏర్పాటు చేయాలన్న నిబంధనలకు నీళ్లొదలడంతో రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో అధికంగా మద్యం మత్తులో జరుగుతున్నవే ఉన్నాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విచ్చలవిడిగా దాబాలు, హోటళ్లు వెలుస్తుండడంతో బయట నుంచి మద్యం తెచ్చుకొని సిట్టింగ్‌లు చేయడం పరిపాటిగా మారి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

నామమాత్రంగా తనిఖీలు..

ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు సరిగా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ప్రతి ఏటా కేసులు నమోదు చేస్తున్నా, దాబాలు, మద్యం దుకాణాలు, వైన్స్‌లపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రహదారుల వెంట బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయడం, వేగంగా నడిపే వాహనాల గుర్తించే సెన్సార్లు ఒకటి.. అరమాత్రమే ఉంచడం, హైవేలపై హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకుండా నడిపే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి.

యథేచ్ఛగా అమ్మకాలు

మండలంలో అనధికారికంగా నడుస్తున్న దాబాలు, రెస్టారెంట్లలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కోదాడ క్రాస్‌రోడ్, ఏదులాపురం క్రాస్‌రోడ్, వెంకటగిరి క్రాస్‌రోడ్, నాయుడుపేట జంక్షన్ ఏరియాల్లో రోడ్ల పక్కన వందల కొద్దీ దాబాలున్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో మద్యం అమ్మకాలు చేయడం, బయటి నుంచి మద్యం తెచ్చుకొని సేవించడం చేయకూడదు. కానీ వాటి నిర్వాహకులు ఇవేమీ పట్టించుకోకుండా మద్యం అమ్మకాలు చేస్తూ సిట్టింగ్‌లు చేయిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి ఒంటి గంట వరకూ వీటిని తెరిచే ఉంచి మద్యానికి తోడు తినుబండారాలు అందుబాటులో ఉంచుతుండడంతో రహదారిపై వెళ్లే వాహనదారులు మద్యం సేవించి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా ఈ ఏడాదిలో ఒక్క రూరల్ మండలంలోనే మద్యం సేవించి ప్రమాదాలకు గురై 10 మంది వరకు మృత్యువాత పడ్డారు. అయితే ఇవన్నీ పోలీస్ రికార్డుల్లో మాత్రం మామూలు ప్రమాదాలుగానే ఉండడం గమనార్హం.

పోలీసులపైనే దాడి?

కోదాడ క్రాస్‌రోడ్‌లోని ఓ దాబాలో గత కొంత కాలం క్రితం మత్తులో ఉన్న తెల్దారుపల్లికి చెందిన కొందరు దాబాలో తినుబండారాలు తీసుకుని సదరు దాబా యజమానికి బిల్లు చెల్లించే విషయంలో గొడవ పడ్డారు. దీంతో రెచ్చిపోయిన అవతలి వారు ఆ యువకులపై దాడి చేసి గాయపర్చారు. ఈ విషయమై గాయపడ్డ యువకులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే తమ అనుచరులను ఎవరో గాయపర్చారని తెలుసుకున్న తెల్దారుపల్లి యువకులు తమ వారిని పరామర్శించడానికి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా.. అప్పటికే ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం నగరం రేవంతిసెంటర్‌కు చెందిన యువకులు ఆస్పత్రికి చేరుకొని మరోమారు దాడి చేశారు. ఇదే సందర్భంలో అడ్డుకోబోయిన అప్పటి రూరల్ ఎస్ఐపై కూడా దాడి చేశారు.

ఎవరినీ ఉపేక్షించం..

నిబంధనల ప్రకారం దాబాల్లో మద్యం అమ్మకాలు నిర్వహించరాదు. అలా కాదని ఎవరైనా మద్యం అమ్మకాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇది ఎక్సైజ్ శాఖ పరిధిలోకి వచ్చినా మేము ఎప్పటికప్పుడు దాడులు చేస్తునే ఉన్నాం. మద్యం అమ్మకాలతో పట్టుబడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

– ముష్క రాజు, రూరల్ సీఐ

సమస్యల పరిష్కారానికి ఆందోళన

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కూసుమంచి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యాన స్థానిక జేవీఆర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.మస్తాన్ మాట్లాడుతూ.. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షేమ వసతి గృహాల్లో విష ఆహారం తిని మృతిచెందిన విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాను, గోని, లోకేష్, సాయి, సతీష్, సాయిరాం, పల్లవి, కీర్తన, మాధవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- కనీస వేతనం మంజూరు చేయాలి

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్ఎస్), సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లు అందరికీ పోస్టుకు తగిన కనీస వేతనం మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల ఎదుట భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రఘునాథపాలెం కేజీబీవీ వద్ద జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, అర్బన్ కేజీబీవీ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి వల్లంకొండ రాంబాబులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొని మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కాకపోతే జనవరి 7న జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష, ఫిబ్రవరిలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీల బాధ్యులు విరిత, అంబిక, ప్రశాంతి విజయలక్ష్మి, రాజకుమారి, వసంత, జ్యోతి, యూటీఎఫ్ జిల్లా నాయకులు సతీష్, నాగేశ్వరరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

గొడుగు వితరణ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని కొబ్బరి బోండాల వ్యాపారి సాల్మన్ రాజుకి లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ ఆధ్వర్యంలో బుధవారం రూ.2500 విలువైన గొడుగు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా లీడర్ ఉంద్రు శ్యామ్‌బాబు, ఉపేందర్‌రావు సహకారంతో గొడుగుని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, క్లబ్ సభ్యులు శోభన, కృష్ణ, కళ, రఘు బాబు, హెడ్ కానిస్టేబుల్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో డైట్ సప్లైకి టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెండేళ్ల పాటు ఇన్ పేషంట్, డ్యూటీ డాక్టర్లు, థెరపిక్ పేషంట్లకు అవసమైన భోజన వసతి(డైట్ సప్‌లై) చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఏజెన్సీలు టెండర్ ఫారం కోసం రూ. 10,000 విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను మెడికల్ సూపరింటెండెంట్, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి పేరు మీద తీయాలని సూచించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్యాలయంలో డిసెంబర్ 6 వరకు టెండర్ ఫారం లభిస్తుండగా.. వారిని పూర్తి చేసి డిసెంబర్ 9లోగా సమర్పించాలన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి నగర సంకీర్తన


కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో బుధవారం గురుస్వామి పిప్పళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యాన అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహంతో నగర సంకీర్తన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు జల, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద గురుస్వామి మంద్రు పుల్లయ్య ఆధ్వర్యాన మహా పడిపూజ జరిపించి అన్నదానం నిర్వహించారు. తర్వాత సహకారం అందించిన పుచ్చకాయల రామకృష్ణ, శ్రీనివాస్, యర్రబోయిన సీతయ్య, తెల్లబోయిన రాము, పిప్పళ్ల శ్రీనులను సన్మానించారు.

శివుడికి బీజేపీ నేతల అభిషేకం

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని బీజేపీ నేతలు బుధవారం పాత ఎస్పీ కార్యాలయం రోడ్డు సుగ్గల వారి తోట శివాలయంలో శివుడికి అభిషేకం చేశారు. మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించినట్లుగా తెలంగాణలోనూ బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటూ ప్రార్థించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, జిల్లా నాయకులు రుద్రప్రదీప్, పిల్లలమర్రి వెంకట్, ధార్న శంకర్, ఉదారి రాధాకృష్ణ, మొరం కిరణ్‌కుమార్, కాకుమానునరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుని..!

నేలకొండపల్లి: ఎరక్కపోయి వచ్చి.. చెరువులో ఓ కుక్క ఇరుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని చెరువుమాధారం చెరువు నుంచి దేవినేని వెంకటరమణ కెనాల్‌కు ఉన్న రెగ్యూలేటర్‌లో గత మూడు, నాలుగు రోజుల నుంచి ఓ కుక్క ఇరుక్కుని అవస్థలు పడుతుంది. బయటకు రాలేక ఆకలితో అరుస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. కానీ చిన్నతండాకు చెందిన యువత ఆటుగా వెళ్తున్న సమయంలో దాని అరుపులు విని తాడు సాయంతో బయటకు తీశారు. అనంతరం ఆహారం అందించి పంపించారు. ఈమేరకు పి.నరేష్, శ్రీకాంత్, సోమశేఖర్, సాయిచంద్, స్టాలిన్ తదితరులను పలువురు అభినందించారు.



కుక్కను కాపాడుతున్న దృశ్యం

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: క్రిస్మస్ పండుగ సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ కనబరచిన క్రైస్తవ వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమశాఖ అధికారి కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర (మైనార్టీ) ఫైనాన్స్ కార్పొరేషన్ 10 ఏళ్లకు పైబడి, 30 ఏళ్లకు పైబడిన సామాజిక, విద్య, వైద్య, సాహిత్య, కళ, క్రీడారంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభ కనపరచిన సంస్థల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి కార్యాలయంలో ఫామ్‌లు తీసుకుని పూర్తి చేసి అదే కార్యాలయంలో వచ్చే నెల 6 సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 08742-231768, 040-23391067లలో సంప్రదించాలని తెలిపారు.

నియామకాలు



తిలకకిషోర్

ఖమ్మంరూరల్: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పోలిశెట్టిగూడెం గ్రామ కార్యదర్శి బి.తిలక్‌కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన్ను సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాధవరావు

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఖమ్మం జిల్లా మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ) జిల్లాలోని మండల అధ్యక్షుల నియమకాల ఉత్తర్వులను ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జుబ్బూరు మాధవరావు బుధవారం ఖమ్మంలో అందజేశారు. ఖమ్మం అర్బన్ అధ్యక్షుడిగా సాయిశశిధర్, ఏన్కూరు, ముదిగొండ, కూసుమంచి, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, కొణిజర్ల మండలాల అధ్యక్షులుగా వరుసగా భూక్యా సందీప్, మల్లారపు ఉపేందర్, ఉడుత రవి, గూదె వీరభద్రం, గోరింట్ల లక్ష్మీనారాయణ, తద్దె వెంకటకృష్ణలకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

టెలీ కమ్యూనికేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా భట్టు

కామేపల్లి: మండలంలోని గరిడేపల్లి గ్రామానికి చెందిన భట్టు నాగేశ్వరరావు టెలీ కమ్యూనికేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు భారత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్ గంట రత్నకుమార్ అభినందనలు తెలిపి నాగేశ్వరరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి భట్టు నాగేశ్వరరావు కొనసాగుతున్నారు.

పాఠశాలకు లైట్లు వితరణ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని దానవాయిగూడెం గురుకుల పాఠశాలకు మూడు లైట్లు వితరణగా అందాయి. ఈ పాఠశాలకు మూడు లైట్లు కావాలని ప్రిన్సిపాల్ అడగడంతో చల్లా కృష్ణ బుధవారం రూ.7,500 విలువ చేసే లైట్లను ఇప్పించారు.

చెత్తను తొలగించి మొక్కలు నాటండి

ఖమ్మంమయూరిసెంటర్: డివిజన్ల వారీగా చెత్త వేసే స్థలాలను శుభ్రం చేసి మొక్కలు నాటాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం కమిషనర్ శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల ఒకటి నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నగరంలోని 60 డివిజన్లనూ శుభ్రం చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు పోకుండా ఆగిన కాల్వలను శుభ్రం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమలో శానిటరీ వర్కర్లు, స్వచ్ఛభారత్ టీం, శానిటరీ జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొనాలని చెప్పారు.



మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

అదనపు ఏజీపీ పోస్టు కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం లీగల్: నగరంలోని న్యాయస్థానాలు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో అదనపు ఏజీపీ పోస్టు కేటాయించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యాన హైదరాబాదులో లా సెక్రటరీ రేండ్ల తిరుపతికి వినతి పత్రం అందజేశారు. ఇంతవరకు ఏజీపీ పోస్టుకు నియామకం జరపకపోవడం వలన కక్షిదారులు, న్యాయవాదులకు ఇబ్బంది అయి సివిల్ కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఏజీపీ పోస్టుతో పాటు అదనంగా మరో ఏజీపీ పోస్టు మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులు టి. దిలీప్, జి.రామారావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తులను కాపాడండి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్తులను కాపాడాలని కోరుతూ బుధవారం తెలంగాణ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గొల్లపూడి రామారావు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈ దేవస్థానానికి గత ప్రభుత్వ హయంలో రూ.వందల కోట్ల విలువ చేసే స్థలాన్ని అప్పగించిందని, కానీ ఇప్పుడు కొంతమంది అక్రమంగా స్వాధీనం చేసుకుని వీధి వ్యాపారస్తుల ప్రాంగణం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తాళ్లూరి దిలీప్‌చౌదరి, పసుపులేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట చౌరస్తాలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రాత్రి ప్రజాపాలన విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల మాట్లాడగా.. ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలను కళారూపాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, జిల్లా సాంఘీక సంక్షేమ, మైనార్టీ సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ, జిల్లా యువజన, క్రీడా సంక్షేమ శాఖ అధికారి సునీల్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

- తెలంగాణ యూత్ డేను..

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): డిసెంబర్ 3న హైదరాబాద్ బషీర్ బాగ్‌లో నిర్వహించే తెలంగాణ యూత్ డేను జయప్రదం చేయాలని తెలంగాణ జన సమితి యువజన విభాగం జిల్లా కన్వీనర్ భట్టు రాజేందర్ కోరారు. బుధవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఖమ్మంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏకకాలంలో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు

- మాలల సింహగర్జనను...

డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని జింకాన గ్రౌండ్స్‌లో నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. బుధవారం ఖమ్మం అంబేద్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు గ్రామాల్లో మాలపెద్దలు, ఆయా ఇన్‌చార్జ్‌లతో సమన్వయం చేసుకుని జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు లింగాల రవికుమార్, దామళ్ల సత్యనారాయణ, పల్లా రాజశేఖర్, నారుమళ్ల వెంకన్న, జాకబ్ ప్రతాప్, బాబురావు, సుధాకర్, కనకరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లక్ష్మీనరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పీఠంలో ఆరోగ్య పరీక్షలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అన్నదాన పీఠంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాగృత్ ఆస్పత్రి వైద్యుడు అబ్దుల్ జియా హుస్సేన్‌తో కలిసి అన్నదాన పీఠాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం దయాకర్‌రెడ్డిని పీఠం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నదానం పీఠం చైర్మన్ తాండ్ర రాంప్రసాద్ గురుస్వామి, పగడాల కిషోర్, పాలేరు పీఠం రమణారెడ్డి, శీలం గోపాల్ రెడ్డి, కోయ హరికిషన్, వరుణ్, పసుపులేటి నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

50 కిలోల ఆవు నెయ్యి వితరణ

ఖమ్మంగాంధీచౌక్: లోక కల్యాణం కోసం నగరంలోని మమతా ఆస్పత్రి రోడ్‌లో నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ పాల్గొని ప్రత్యేక హోమాలు చేశారు. అనంతరం యాగ నిర్వహణకు 50 కిలోల ఆవు నెయ్యిని అందించారు. ఈ కార్యక్రమంలో యాగ సంకల్ప పిత భవ్యశ్రీ వృధాశ్రమం నిర్వాహకులు సునీత, యాగకర్త దండ్యాల లక్ష్మణ్‌రావు, గుర్రం మురళి, వేంపటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కూసుమంచి: వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండగా బుధవారం పాలేరులోని ఐకేపీ కేంద్రంలో పలువురు రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి రాంరెడ్డి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, బదావత్ నరేష్, పుల్లారెడ్డి, నరేష్, వెంకటరెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్' విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల మహబూబాబాద్ జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్ కల్వాల స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తమ జూనియర్ కళాశాల విద్యార్థి కొత్తపల్లి వినయ్‌కుమార్ బంగారు పతకం సాధించినట్లు రెజొనెన్స్ జూనియర్ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని బుధవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటు ప్రసాద్ మరణం తీరని లోటు

నేలకొండపల్లి/ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం పార్టీకి తీరనిలోటని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రసాద్ సంతాప సభ నిర్వహించగా గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పాల్తీయ శ్రీనివాసరావు మాట్లాడారు. పార్టీ నిర్మాణం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడి సంఘం తరపున సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భూక్యా రాములునాయక్, గుగులోత్ వెంకటేశ్వర్లు, రూప్లానాయక్, బాలాజీ, రంజిత్, రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ సీనియర్ నాయకులు పోకలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలానా, గన్నా చంద్రశేఖర్, దండి సురేష్ విద్యాసంస్థల యాజమాన్యాలు, గ్రానైట్ అసోసియేషన్, ప్రముఖ వైద్యులు పి.గోర్కీ, వై.ప్రసాద్, భారవి, యలమంచలి రవీంద్రనాద్, న్యాయవాదులు, ప్రజా సంఘాల బాధ్యులు సందర్శించి నివాళులు అర్పించారు.

మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు అవసరం

కామేపల్లి: మొక్కజొన్న విత్తనోత్పత్తి సాగు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. బుధవారం మండలంలోని బాసిత్‌నగర్, ముచ్చర్ల గ్రామాల్లో మొక్కజొన్న సాగు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఆడ, మగ మొక్కజొన్న సాగులో తప్పనిసరిగా కంపెనీ ఏజెంట్ నుంచి అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు. వానాకాలం పంట పూర్తయిన అవశేషాలను కాలకుండా కలియదున్నాలని సూచించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ తారాదేవి